అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రజా సంక్షేమయాత్ర పెద్దపొలమడ నుంచి చిన్నపొలమడ మీదుగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకుంది. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ఎమ్మెల్యేకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతానికిపైగా హామీలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కుల, మత, పార్టీ, వర్గ లింగ భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఏడాదిలో ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి 3 లక్షల వరకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతోందని గుర్తుచేశారు. పథకాల అమలుతో పాటు గ్రామాల్లో గత పాలకుల పాలనలో నాటిన ఫ్యాక్షన్ వృక్షాన్ని సమూలంగా నిర్మూలించేలా ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రజా సంక్షేమ యాత్రను చేపట్టామని తెలిపారు. ప్రజలు తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలంటే మరో మారు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాల్సిన అవసరం ఉందన్నారు.


ప్రజా సంక్షేమ యాత్రలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో కలసి నడుస్తున్న అనంతపురం ఎంపీ తలారి రంగయ్య

ప్రజా సంక్షేమ యాత్రకు ఎంపీ తలారి రంగయ్య సంఘీభావం...

చిన్నపొడమలలో అనంతపురం ఎంపీ తలారి రంగయ్య ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని కలిసి ప్రజా సంక్షేమ యాత్రకు సంఘీభావం తెలిపారు. ఫ్యాక్షన్ వద్దు.. ప్రశాంత జీవితమే ముద్దు.. అన్న సందేశాన్ని ప్రజలకు తెలియజేయాలన్న ఆలోచనతో ఎమ్మెల్యే చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర అభినందనీయమని ఎంపీ పేర్కొన్నారు. తాడిపత్రి మండలంలో మరో రోజు మిగిలి ఉన్న ప్రజా సంక్షేమ యాత్రను ఎమ్మెల్యే దిగ్విజయంగా పూర్తి చేయాలని ఆయన ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ యువ నేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, సర్పంచులు నాగేంద్రమ్మ, శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి, వైస్ సర్పంచ్ పెద్దిరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, భోగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి వైఎస్సార్ పశుబీమా అమలు

యాడికి: జూన్ 1 నుంచి వైఎస్సార్ పశుబీమా అమలు చేయనున్నట్లు పశు వైద్యాధికారి సుబ్బారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పశు పెంపకందారులను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై గడ్డి విత్తనాలు, పాల ధర పెంపు, సబ్సిడీపై మినీ గోకుల్ షెడ్లు ప్రవేశ పెట్టామని పేర్కొన్నారు. బీపీఎల్ లబ్ధిదారులు ప్రీమియంలో 20 శాతం, ఏపీఎల్ లబ్ధిదారులు 50 శాతం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక్కో కుటుంబానికి 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలు, పందులకు బీమా చేయించుకునేందుకు అవకాశం ఉందని వివరించారు.

వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

గుత్తి: ఎస్ఎస్ పల్లి ఏరియాలో వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ఫిల్లింగ్ స్టేషన్ నుంచి పైప్‌లైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. డీఈ ఇంతియాజ్, ఏఈ శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎరువుల పరిశీలన


ఎరువుల బస్తాలను పరిశీలిస్తున్న ఏడీఏ చెంగల్‌రాయుడు

యల్లనూరు: నిట్టూరు ఆర్బీకే కేంద్రంలో ఉన్న డీఏపీ, యూరియా నిల్వలను తాడిపత్రి ఏడీఏ చెంగల్‌రాయుడు పరిశీలించారు. శుక్రవారం నిట్టూరు, పెద్దమల్లేలపల్లి ఆర్బీకే సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. త్వరలోనే వేరుశనగ విత్తనకాయలను ఆర్బీకేల్లో రిజిష్టరు చేసుకున్న రైతులకు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. ఆయన వెంట చిలమకూరు సచివాలయ ఉద్యోగి విజయ్ ఉన్నారు.

నేటి నుంచి తైక్వాండో పోటీలు

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులోని బాలాజీ ఫంక్షన్ హాలులో శనివారం రాయలసీమ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభించనున్నట్లు తైక్వాండో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి తెలిపారు. రాయలసీమ ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు పోటీలు జరగనున్నట్లు తెలియజేశారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతి, మైమూన్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 24వ వార్డు సెయింట్ పీటర్స్ స్కూల్ వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.7.5 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ భూమిపూజ చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయించాలని ఇంజినీర్లకు సూచించారు. ఏఈ శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, ఖలీల్, సాయిరామ్‌ఫ్లెక్స్ రెడ్డి, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బదులు పేరుతో పనులకు రావొద్దు


ఉపాధి రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

బుక్కరాయసముద్రం: బదుల పేరుతో ఉపాధి హామీ పనులకు ఎవరూ రావొద్దని ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం బాట్లో కొత్తపల్లి, పొడరాళ్లలో ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి మస్టర్లను పరిశీలించారు. ఎంత మంది కూలీలు ఉన్నారు,ఎంత మంది పనులకు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ కింద ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కూలీలు ఒకరి పేరుతో మరొకరు ఉపాధి పనులకు రాకుండా ఉపాధి సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో శుక్రవారం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఫ్లారెన్స్ దీపా ఆధ్వర్యంలో ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షిస్తామని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.

ఆముదం పంట సాగుపై అవగాహన


మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి

బుక్కరాయసముద్రం: రైతులు ఆముదం పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రేకులకుంటలో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానంలో అఖిల భారత ఆముదపు సమన్వయ పరిశోధనా పథకం, భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ హైదరాబాద్ వారు సంయుక్తంగా ఇన్‌పుట్ డీలర్లకు ఆముదం సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి మాట్లాడుతూ ఆముదం పంట లాభదాయకంగా ఉంటుందన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సీవీ ఎస్ రెడ్డి, డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ రాధిక, డాక్టర్ సుధీర్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సహజ, ఆత్మా పీడీ మద్దిలేటి, డాక్టర్ లక్ష్మిరెడ్డి, ఆది నారాయణ, చంద్రమౌళి, చరణ్, మంజునాథ్ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు నిధులు విడుదల హర్షణీయం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

గుత్తి: హజ్ యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం హర్షణీయమని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం మైనార్టీ సెల్ నాయకులు అబ్దుల్, నజీర్, సుంకం రఫీ, ఫయాజ్, మున్నా, మర్తాడు అన్సార్, అజీజ్‌ఖాన్, మైనుద్దీన్, దస్తగిరి, సికిందర్, కటిక ఖురేషి అన్వర్, వెల్డింగ్ రవూఫ్, బీఎంఎస్ రఫీద్దిన్ విలేకరుతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల పక్షపాతి అని, ఇప్పటికే తమ కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ఇపుడు ఏకంగా హజ్ యాత్రికులకు ఏకంగా రూ. 14.51 కోట్లు విడుదల చేశారన్నారు. జీవితాంతం జగన్‌కు అండగా ఉంటామన్నారు. నాయకులు బాషా, అంగడి బాషా, డిష్ అన్వర్, గోరా మాబు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయండి


మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

గుత్తి: అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప సిబ్బందిని సూచించారు. పట్టణంలోని ఎంఎస్ కాలేజీ క్రీడామైదానంలో శుక్రవారం గుత్తి, పామిడి పోలీసులకు పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ దొంగతనాలు, సైబర్ నేరాలను పూర్తిగా కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడూ సమాచారాన్ని పోలీసు ఉన్నతాధికారులకు చేరవేయాలన్నారు. రౌడీలు, గుండాలు, యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మట్కా, జూదాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుత్తి, పామిడి సీఐలు వెంకటరామిరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు రామకృష్ణారెడ్డి, చాంద్‌బాషా, ఏఎస్ఐలు రామచంద్రారెడ్డి, ఆజాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప

బుక్కరాయసముద్రం: జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ మద్దిలేటి కుటుంబానికి శనివారం బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మద్దిలేటి కుటుంబానికి సిబ్బంది మానవతా దృక్పథంతో రూ.1.05 లక్షలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం చెక్కును హెడ్ కానిస్టేబుల్ భార్య జయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మద్దిలేటి బ్యాచ్‌మేట్స్ హర్షవర్ధన్‌రెడ్డి, దేవేంద్ర, రఘువీర ప్రసాద్, బెటాలియన్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాలిపోయిన చెరకు తోట


బొందలవాడలో కాలిపోయిన చెరకు తోట

నార్పల: విద్యుదాఘాతంతో ఓ రైతుకు చెందిన చెరకు తోట కాలిపోయిన సంఘటన మండల పరిధిలోని బొందలవాడలో శుక్రవారం జరిగింది. బాధిత రైతు వివరాలమేరకు.. బొందలవాడకు చెందిన రైతు రమేష్ తనకున్నా రెండు ఎకరాల పొలంలో నాలుగు నెలల క్రితం చెరకు పంట సాగు చేశారు. కొద్ది రోజుల్లో పంట కోత దశకు వస్తుందనగా పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి పంట మొత్తం కాలి బూడిదైంది. డ్రిప్పు పరికరాలు కూడా పూర్తిగా కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని పక్క పొలాలో మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనతో రైతుకు దాదాపు రూ.3 లక్షల దాకా నష్టం వచ్చింది. బాధితుడు రమేష్ వీఆర్ఓ దాదాపీర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ సునీతకు విషయాన్ని తెలియజేశానని, అయితే వారు ఘటనా స్థలానికి రాకుండా ఫొటోలు వాట్సాప్‌కు పెట్టమన్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇద్దరు చిన్నారుల అదృశ్యం


హర్షిత్‌సాయి , నాగాదిత్య

తాడిపత్రి అర్బన్: పట్టణానికి చెందిన ఇద్దరు చిన్నారుల అదృశ్యమైన ఘటన పట్టణంలో కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని అంబాభవాని వీధిలో అమరావతి, రాజు పక్కపక్కనే నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం అమరావతి కుమాడు హర్షిత్ సాయి(15) తన తల్లితో ఆట్లాడుకునేందుకు గ్రౌండ్‌కు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. నాగాదిత్య(13) ఐఐటీ కోచింగ్‌కు వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనపడకుండా పోయాడు. హర్షిత్‌సాయి నారాయణ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. నాగాదిత్య శ్రీచైతన్య స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. అయితే హర్షిత్ సాయి ఇంటి నుంచి వెళ్లిపోచేటప్పుడు తన తల్లికి చెందిన ఏటీఎం కార్డును తీసుకెళ్లి రూ.10వేలు డ్రా చేసుకున్నట్లు సమాచారం. పిల్లల కోసం తల్లిదండ్రులు తెలిసిన చోటల్లా గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పిల్లల కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు.

తురకపల్లిలో మహిళ ఆత్మహత్యాయత్నం

• కాపాడిన పోలీసు కానిస్టేబుల్, హోంగార్డు


ఆత్మహత్యకు యత్నించిన జీపల్లి దేవి

గుత్తి రూరల్: తురకపల్లిలో ఓ మహిళ శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు రక్షించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బాలప్ప అనే యువరైతు ఏప్రిల్ 29న గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. బాలప్ప వ్యవసాయం ఇతర అవసరాలకు భారీ ఎత్తున అప్పులు చేశాడు. అయితే అతడు మృతి చెందిన అనంతరం అప్పులు ఇచ్చిన వాళ్లు తిరిగి చెల్లించాలని భార్య జీపల్లి దేవిపై ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో మృతుడి పేరిట ఉన్న నాలుగు ఎకరాల భూమిని విక్రయించి పంచాయితీ చేసి అప్పు ఉన్న 15 మందికి సగం చొప్పున డబ్బు చెల్లించారు. అయితే కొందరు మాత్రం తమకు మొత్తం డబ్బు చెల్లించాల్సిందే అని రోజూ రాత్రి ఇంటి వద్ద వచ్చి దేవితో గొడవకు దిగేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో కొందరు వచ్చి డబ్బు ఎప్పుడు చెల్లిస్తారని దేవితో గొడవకు దిగారు. దింతో తీవ్ర మనస్థాపం చెందిన దేవి అందరి ముందే చేయి కోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. అక్కడ ఉన్న వారు అడ్డుకోగా ఇంట్లోకి వెళ్లి తలుపులు మూసుకొని ఇంటి పైకప్పుకు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు ఇంటి తలుపులు బద్దలు కొట్టేందుకు యత్నించారు. స్థానికుల సమాచారంతో కానిస్టేబుల్ మహేష్, హోంగార్డు హుస్సేన్‌పీరాలు వెంటనే గ్రామానికి చేరుకుని ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఇంట్లో ఉరికి వేలాడుతున్న జీపల్లి దేవిని కిందకు దింపారు. వెంటనే గుత్తి ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి గ్రామానికి చేరుకొని ఉరికి వేలాడుతున్న మహిళను కాపాడిన కానిస్టేబుల్ మహేష్, హోంగార్డు హుస్సేన్‌పీరాను పలువురు అభినందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి కార్యక్రమాలు

వలంటీర్లకు పురస్కారాలు

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సత్కరించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

గార్లదిన్నె: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

మెగా కంటి వైద్యశిబిరం

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్‌బజార్‌లోని ఆర్ వీస్వామి కల్యాణ మండపంలో శనివారం ఉదయం 8 గంటలకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరగనున్నట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి, తాడిపత్రి వాసవీక్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం జరగనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా నరసింహులు



బుక్కరాయసముద్రం: సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా దండువారిపల్లి ఆర్బీకే ఇన్‌చార్జ్ నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గం ఎన్నికలో భాగంగా తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు నరసింహులు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యలపై చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు.

ఉపాధి పనులు నాణ్యతతో చేపట్టండి

పామిడి: నాణ్యతతో ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం రామరాజుపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలిచారు. మస్టర్ రోల్‌ను తనిఖీ చేశారు. వలసల నివారణతో పాటు గ్రామాభివృద్ధికి తోడ్పడేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వసతులు కల్పించాలని ధర్నా

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నాయకులు శుక్రవారం ర్యాలీ, ధర్నా చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ ఆధ్వర్యంలో సీపీఐ, సీపీఎం, టీడీపీ, జనసేనకు చెందిన పలువురు కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శ రామదాసు, రమేష్, మాబు, సీపీఎం నాయకులు రామకృష్ణ, టీడీపీ నాయకులు జిలాన్, దిల్కా శీనా, వీరేష్, వెంకటశివుడు యాదవ్, జనసేన నాయకులు పాటిల్ సురేష్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ మ్యాచ్‌లో ఘర్షణ


గాయపడిన అభిరామ్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మోదినాబాద్ మైదానంలో జరిగిన క్రికెట్ మ్యాచ్ ఘర్షణకు దారి తీసింది. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం ఇరుజట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఈసందర్భంగా రనౌట్ విషయమై అభిరామ్, నరసింహులుకు మధ్య గొడవ జరిగింది. దీంతో నరసింహులు క్రికెట్ బ్యాట్‌తో అభిరామ్ తలపై దాడి చేశాడు. గాయపడిన అభిరామ్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

గుంతకల్లు రూరల్: మండలంలోని దోనలుడుకి గ్రామ శివారులో నాటుసారా ఓ మహిళను శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసి 8 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు కసాపురం ఎస్ఐ గోపాలుడు తెలిపారు. గుండాల తండాకు చెందిన దానమ్మ దోసలుడుకి వద్ద నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి అరెస్ట్ చేశామన్నారు.

బాల్య వివాహాలతో జీవితాలు నాశనం


మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి

గార్లదిన్నె: బాల్యవివాహాలతో చిన్నారుల జీవితాలు నాశనమవుతాయని మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులు బాల్యవివాహాలపై మండలస్థాయి అధికారులు,గ్రామ సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి మాట్లా డుతూ తల్లిదండ్రులు బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. బాల్యవివాహాలు ప్రోత్సహించడం నేరమన్నారు. బాల్య వివాహాలతో పుట్టబోయే పిల్లలో సరైన ఎదుగుదల లేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ తేజోత్స్న, ఎంఈఓ చంద్రనాయక్, ఏఎస్ఐ దేవదాసు, ఏపీఎం శ్రీరాములు, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, వీఆర్ఓలు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పండ్లతోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ శైలజ

బుక్కరాయసముద్రం: ఉద్యాన పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల ఉద్యాన అధికారి శైలజ పేర్కొన్నారు. శుక్రవారం రెడ్డిపల్లిలో అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రత, అధిక తేమతో కొత్తగా నాటిన అరటి తోటలకు బ్యాక్టీరియా ఎక్కువగా వ్యాపిస్తోందన్నారు. రైతులు నాణ్యమైన అరటి పిలకలు ఎంపిక చేసుకోవాలన్నారు. కాపర్ ఆక్సిక్లోరైడ్ సొల్యూషన్‌లో డ్రిప్ చేసి పిలకలు నాటుకోవాలన్నారు. దుక్కిలో పశువుల ఎరువు, వేప పిండి, ట్రైకోడెర్మా ఎరువులను తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. కాండం కుళ్లు తెగులు కనిపించినప్పుడు 20 గ్రాముల బ్లీచింగ్ పౌడర్ లీటరు నీటికి కలిపి మొక్క వేరు దుంప బాగా తడిచేలా పోయాలన్నారు. తెగులు సోకిన మొక్కలు తొలగించాలన్నారు. అనంతరం వేసవిలో ఉద్యాన పంటల్లో తెగుళ్లు, నివారణ చర్యలను వివరించారు. ఆర్బీకే సిబ్బది నదియా, రైతులు కృష్ణారెడ్డి, జయరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, అశ్వత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ సమగ్ర సర్వే వేగవంతం చేయండి


అరకటివేములలో భూ సర్వే ప్రారంభిస్తున్న అధికారులు


నక్కనదొడ్డిలో సర్వేపై సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ రవీంద్ర

యల్లనూరు: రీ సర్వే పనులు వేగవంతం చేయాలని అనంతపురం ఆర్డీఓ మధుసూదన్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నిట్టూరు గ్రామంలో జరిగే రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నోటీసులు ఇచ్చిన తర్వాత సర్వే ప్రారంభించాలన్నారు. కొందరు రైతులు తమ పొలాల్లోకి వచ్చి పాయింట్లు తీసుకుంటున్నారని ఏమీ చెప్పడం లేదని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. మా సిబ్బంది క్యూజీఐఎస్ లోకి మార్పు చేసుకొని త్వరలోనే రైతులకు తెలియజేస్తారని సిబ్బందిపై ఒత్తిడి తీసుకురావొద్దని ఆర్డీఓ సమాధానం ఇచ్చారు. డీఐఓయస్ వెంకట చెన్నయ్య, తహసీల్దార్ రమాదేవి, మండల సర్వేయర్ షర్మిని, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: రీ సర్వే కార్యక్రమంతో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఆర్డీఓ రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నక్కనదొడ్డిలో రీసర్వే పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములన్నింటినీ రీ సర్వే చేసి రైతులకు హక్కు పత్రాలను అందజేస్తామన్నారు. తహసీల్దార్ రాము, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆదినారాయణ, సర్వేయర్ మారెప్ప, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

పుట్లూరు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా శుక్రవారం అరకటివేముల, సూరేపల్లి, దోశలేడు, మడుగుపల్లి గ్రామాల్లో రీ సర్వేను ప్రారంభించారు. అరకటివేములలో నిర్వహించిన గ్రామసభకు ఆర్డీఓ మధుసూదన్ హాజరై సర్వే గురించి ప్రజలకు వివరించారు. సర్వేకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, డీటీ మల్లేష్, వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పామిడి: సొరకాయలపేట గ్రామంలో తహసీల్దార్ ఆర్వీ సునితబాయి ఆధ్వర్యంలో శుక్రవారం రీ సర్వే ప్రారంభించారు. జగనన్న శాశ్వత హక్కు–భూరక్ష పథకంపై వారు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జగనన్న రీసర్వేకు గ్రామస్తులు సహకరించాలని వారు కోరారు. డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మినారాయణరెడ్డి, సర్పంచ్ మూలి నాగేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా అర్హుల జాబితా ప్రదర్శన

యాడికి: వైఎస్సార్ రైతు భరోసా పథకానికి సంబంధించి అర్హుల జాబితాను మండలవ్యాప్తంగా ఉన్న ఆర్‌బీకేల్లో ప్రదర్శించినట్లు ఏఓ మహబూబ్‌బాషా శుక్రవారం తెలిపారు. మండలంలో ఇప్పటికే 7,341 మంది రైతులు రైతు భరోసా లబ్ధిదారులు ఉన్నారని, కొత్తగా ఈ ఏడాది 94 మంది అర్హత పొందారన్నారు.

ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్ పట్టివేత

తాడిపత్రి: మండలంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లతో పాటు ఒక టిప్పర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు రూరల్ సీఐ చిన్నపెద్దయ్య తెలిపారు. శ్రీనివాసపురం సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, సజ్జలదిన్నె వద్ద ఒక టిప్పర్‌ను పట్టుకుని, కేసు నమోదు చేశామన్నారు.